క్లుప్తంగా

బీచ్‌లో రాజ్‌కుమార్ మృతదేహం

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు రోజులుగా కనిపించకుండా పోయిన వ్యక్తి శవమయ్యాడు. ఎస్ఐ సూర్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం ఎండాడకు చెందిన ఇందుకూరు రాజ్‌కుమార్ (50) తరచూ సాగర్‌నగర్ ఇస్కాన్ ఆలయానికి వెళ్తుంటాడు. రోజులాగే ఈనెల 17 ఉదయం 7.15 గంటలకు ఇస్కాన్ ఆలయానికి వెళ్లి తిరిగి ఇంటికి చేరలేదు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు వెతికినా కనిపించలేదు. దీంతో ఆయన భార్య లక్ష్మి ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం అతని మృతదేహం ఇస్కాన్ ఆలయం ఎదురుగా బీచ్‌లో స్థానికులు గుర్తించారు. ఈ విషయం తెలుసుకున్న ఆరిలోవ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతికి సరైన కారణాలు తెలియలేదని పోలీసులు తెలిపారు.

బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా రాకేష్



ఉత్తర్వులు అందిస్తున్న ఎంపీ జీవీఎల్

ఎంవీపీకాలనీ: బీజేపీ ఎస్సీ మోర్చా విశాఖ జిల్లా అధ్యక్షుడిగా గనిరెడ్డి రాకేష్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ నగర కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ జీవీఎల్ నరసింహారావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర ఆయనకు ఉత్తర్వులు అందజేశారు. పార్టీ నాయకులు రాకేష్‌కు అభినందనలు తెలిపారు.

'ఓ' నెగెటివ్ రక్తదానం



'ఒ' నెగెటివ్ రక్తనిధి అందిస్తున్న ఒలిశెట్టి గురునాథ్

మద్దిలపాలెం: అత్యంత అరుదుగా దొరికే 'ఒ' నెగెటివ్ రక్తాన్ని ఓ రోగికి అందించి ఒలిశెట్టి సత్య చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఒలిశెట్టి గురునాథ్ ఆదుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర సమయంలో రక్తదానం చేయడానికి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత 20 ఏళ్లుగా విరివిగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నానన్నారు. ఎవరికైనా అత్యవసరంగా రక్తం కావాలంటే తనను సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు.

ఉద్యానవనంలో మహనీయుల చిత్రాలు



వాకర్స్ పార్కులో క్లబ్ గోడపై మహనీయుల చిత్రాలు వేస్తున్న కళాకారులు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో మహనీయుల కుడ్య చిత్రాల పెయింటింగ్ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. ఇక్కడికి వచ్చే సందర్శకులు, చిన్నారులు, విద్యార్థులు, వాకర్స్‌లో దేశభక్తిని కలిగించేలా పలువురు మహనీయుల కుడ్య చిత్రాలు ఏర్పాటు చేయాలని వాకర్స్ క్లబ్ సభ్యులు నిర్ణయించారు. ఈ మేరకు మహాత్మా గాంధీ, అల్లూరి సీతారామరాజు, గురజాడ అప్పారావు తదితరుల చిత్రాలను వాకర్స్ పార్కు చిత్రాలకు సంబంధించి గోడలపై పెయింటింగ్ పనులు చేస్తున్నారు. క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి పర్యవేక్షణలో చిత్రకారులు చిత్రాలు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. త్వరలోనే వీటిని పూర్తి చేసి సందర్శనకు ఏర్పాటు చేస్తామని చంద్రమౌళి తెలిపారు.

సీతకొండ వద్ద చింత లేదిక..

- సీతకొండ – సాగర్‌నగర్ బీచ్‌రోడ్డు విస్తరణ
- 30 అడుగుల నుంచి 80 అడుగులకు విస్తరిస్తున్న జీవీఎంసీ
- డివైడర్, సెంట్రల్ లైటింగ్, ఫుట్‌పాత్ నిర్మాణం
- వాహనచోదకుల హర్షం



సీతకొండ మలుపు వద్ద విస్తరించిన రోడ్డు



సీతకొండ సాగర్‌నగర్ మధ్య విస్తరిస్తున్న రోడ్డు

ఆరిలోవ: సీతకొండ మలుపు వద్ద రహదారి విస్తరణ చేపట్టడంతో వాహనచోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదకరమైన ఈ మలుపు వద్ద ఇరుకురోడ్డుతో తరచూ ప్రమాదాలు జరుగుతూ ఉండేవి. ఆ సమస్యలకు చెక్ పెడుతూ సీతకొండ నుంచి సాగర్‌నగర్ వరకు బీచ్ రోడ్డును విస్తరిస్తుండడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

ఆర్‌కే బీచ్ నుంచి భీమిలి వరకు సుమారు 30 కిలోమీటర్ల బీచ్ రోడ్డు ఉంది. దీని మధ్య సీతకొండ చివర (వైఎస్సార్ సీ వ్యూ పాయింట్) నుంచి జూ పార్కును ఆనుకుని బీచ్‌రోడ్డులో విశాఖ వ్యాలీ స్కూల్ కూడలి వరకు సుమారు అర కిలోమీటరు పొడవునా ఇరుకు రోడ్డు ఉంది. మిగిలినదంతా డబుల్ రోడ్డే. ఇక్కడ ఓ పక్క సీతకొండ అంచు, మరోపక్క సముద్రం వైపు పెద్ద లోయ ఉంది. వీటి మధ్య సింగిల్ లైన్‌తో పాటు ప్రమాదకరమైన రెండు మలుపులున్నాయి. దీంతో ఈ ప్రాంతం ప్రమాదకరంగా మారింది. తరచూ ప్రమాదాలు జరుగుతూ ఉండటంతో వాహనచోదకులు హడలిపోయేవారు. ఎదురెదురు వాహనాలు ఢీకొనడం, అదుపు తప్పి వాహనాలు బోల్తా పడటం వంటి ఘటనలు ఎన్నో. ఇప్పుడు ఆ ప్రమాదాలకు జీవీఎంసీ అధికారులు అడ్డుకట్ట వేస్తున్నారు. సుమారు 30 అడుగుల వెడల్పు ఉన్న ఈ రోడ్డును 80 నుంచి 100 అడుగులకు విస్తరిస్తున్నారు.

డివైడర్లు, సెంట్రల్ లైటింగ్, రోడ్డు పక్కన ఫుట్‌పాత్, గ్రీనరీ ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో వాహనాల రద్దీ ఎక్కువ కావడంతో అధికారులు చర్యలు చేపట్టారు. ఎన్నో ఏళ్లగా ఈ రోడ్డు విస్తరణ కోసం ఎదురు చూస్తున్న రుషికొండ, సాగర్‌నగర్, విశాలాక్షినగర్‌వాసులు రహదారి విస్తరణపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రోడ్డు మధ్యలో జరుగుతున్న డివైడర్ పనులు

తల్లి చెంతకు చిన్నారులు



చిన్నారులను తల్లి వద్దకు చేర్చిన కానిస్టేబుళ్లు బీవీ కిషోర్, ఎం.సతీష్

బీచ్‌రోడ్డు: దసరా సెలవులు కావటంతో చిన్నారులతో సముద్ర తీరంలో సరదాగా గడిపేందుకు ఇద్దరు కుమారులతో వచ్చిన తల్లి నుంచి చిన్నారులు తప్పిపోయారు. పూర్ణామార్కెట్ ప్రాంతానికి చెందిన చిన్నారులు అదిల్, అబిత్ తల్లితో కలిసి గురువారం రాత్రి ఆర్కే బీచ్‌కు వచ్చారు. వారు తల్లికి దూరంగా వెళ్లి ఆడుకోవడానికి వెళ్లి వేరు పడిపోయారు. దీంతో తల్లి గాబరా పడి బీచ్‌లో గల టూరిస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తమ గ్రూపులో మెసేజ్ ఫార్వార్డ్ చేయగా కానిస్టేబుళ్లు బీవీ కిషోర్, ఎం.సతీష్ చిన్నారులను బీచ్‌లో గుర్తించి తల్లి వద్దకు చేర్చారు. దీంతో ఆమె సంతోషం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు. త్రీటౌన్ సీఐ కోరాడ అప్పారావు కానిస్టేబుళ్లను అభినందించారు.

డాక్టర్ సూర్యప్రకాశరావుకు అభినందనలు



ఆచార్య సూర్యప్రకాశరావును అభినందిస్తున్న బీసీ సంఘం ప్రతినిధులు

ఎంవీపీకాలనీ: ఏయూ పూర్వ ఆచార్యుడు డి.సూర్యప్రకాశరావును రాష్ట్ర బీసీ సంఘం ప్రతినిధులు అభినందనలు తెలిపారు. ఏయూ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్‌గా పదవీ విరమణ చేసిన ఆయన దామోదర్ సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ ఉపకులపతిగా నియమితులయ్యారు. ఈ మేరకు బీసీ సంఘం ప్రతినిధులు, ఏయూ పూర్వ విద్యార్థులు ఆయనను కలిసి అభినందించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి, వర్సిటీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాలకు ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఆయనకు ఉపకులపతి పదవి లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర కన్వీనర్ పితాని ప్రసాద్, దంతేశ్వర్ పట్నాయక్, మడికి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కృష్ణా కళాశాలలో 'అమృత్కాల్ విమర్శ్ వికసిత్ భారత్'

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్. కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అమృత్కాల్ విమర్శ్ వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ సౌజన్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

రిసోర్స్ పర్సన్‌గా ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య టీ.వి.కట్టమని, గౌరవ అతిథిగా ఐ.సి.ఎస్.ఎస్.ఆర్. డైరెక్టర్ ఆచార్య బి.సుధాకర్‌రెడ్డి హాజరు కానున్నారని పేర్కొన్నారు.

ఆరు నెలల్లో లక్ష ఉద్యోగాల కల్పన

అమెజాన్ ఇండియా మార్కెటింగ్ డైరెక్టర్ కిషోర్



బీచ్‌రోడ్డు: దేశవ్యాప్తంగా గత ఆరు నెలల్లో వివిధ విభాగాల ద్వారా లక్షకు పైగా ఉద్యోగాలు కల్పించినట్లు అమెజాన్ ఇండియా మార్కెటింగ్ డైరెక్టర్ కిషోర్ తోట తెలిపారు. గురువారం ఒక హోటల్లో అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ వివరాలను మీడియాకు తెలిపారు. మొదటి 48 గంటల్లో 9.5 కోట్ల మంది కస్టమర్లు ఆర్డర్ చేశారన్నారు. అలాగే 5 వేల నూతన ఉత్పత్తులను ఈ ఫెస్టివల్‌లో ఆవిష్కరించామన్నారు. ఈ ఫెస్టివల్‌లో 14 లక్షల మంది అమ్మకందారులు తమ ఉత్పత్తులను విక్రయించినట్లు తెలిపారు. అమెజాన్‌లో అమ్మకాలు సాగించేందుకు వ్యాపారులకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. పిన్‌కోడ్ ఉన్న ప్రతి ప్రాంతానికి తమ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు.

పరిశుభ్ర క్యాంపస్‌గా ఏయూ

విద్యార్థుల భాగస్వామ్యంతో 'స్వచ్ఛతా హీ సేవ'



పరిసరాలను శుభ్రం చేస్తున్న ఆచార్యులు, విద్యార్థులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని పరిశుభ్ర క్యాంపస్‌గా తీర్చిదిద్దాలని ఏయూ విద్యా విభాగాధిపతి డాక్టర్ టి.షారోన్ రాజు కోరారు. ఇందులో విద్యార్థుల భాగస్వామ్యం కీలకమన్నారు. ఏయూ విద్యా విభాగంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపును స్వాగతిస్తూ గురువారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలోని పరిసరాలను విద్యార్థులు, ఆచార్యులు శుభ్రం చేశారు. ముందుగా విద్యా విభాగం తరగతి గదులను, పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ డి.నాగరాజ కుమారి, విభాగ అధ్యాపకులు డాక్టర్ ఆలీ, డాక్టర్ రాము, డాక్టర్ సాల్మన్ రాజు, డాక్టర్ మూర్తి, డాక్టర్ ప్రకాశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవుడి ఆలయంలో ధర్మప్రచార వారోత్సవాలు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధర్మప్రచార వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో బండారు ప్రసాద్ ప్రకటనలో తెలిపారు. మన సంస్కృతి సంప్రదాయాలపై ప్రజల్లో అనురక్తి కలిగించే ఉద్దేశంతో ఈ నెల 22 నుంచి 28 వరకు ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. 22న వైభవుడికి ప్రత్యేక పూజల అనంతరం కోలాటం, అమ్మవారికి అర్చన, తీర్థగోష్ఠి జరుగుతాయి. 23న పద్మావతి అమ్మవారికి అర్చన, 24న ఆధ్యాత్మిక ప్రసంగాలు, 25న జమ్మి వాత్సల్య బృందం అన్నమాచార్య కీర్తనలు, 26న నృత్య సేవ, 27న ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో భజన, సత్సంగం, 28న ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం నిర్వహిస్తారు.

ఎంపీ జీవీఎల్‌కు సమస్యల నివేదన



జీవీఎల్‌తో సమావేశమైన బ్రాహ్మణ సొసైటీ ప్రతినిధులు

ఎంవీపీకాలనీ: బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావుతో బ్రాహ్మణ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు లాసన్స్ బే కాలనీలోని ఆయన నివాసంలో గురువారం ఈ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సంఘం గౌరవ అధ్యక్షుడు టీఎస్‌ఆర్ ప్రసాద్ పలు సమస్యలను జీవీఎల్ దృష్టికి తీసుకెళ్లారు. 2016లో మాధవధారలో బ్రాహ్మణ సామాజికవర్గ భవనానికి 22 సెంట్ల భూమి కేటాయించినప్పటికీ భూమి అప్పగింతలో నేటికీ ముందడుగు పడలేదన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి జీవీఎల్ స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి వీలైనంత త్వరగా భూమి అప్పగింతకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'ప్రకృతి 2కే23' ఫెస్ట్



ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న స్వప్న

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రకృతి 2కే23 పేరిట బయో ఫెస్ట్‌ను నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించిన ఫెస్ట్‌లో పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్, పోస్టర్ ప్రెజెంటేషన్, డిబేట్, క్విజ్ తదితర కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కళాశాల ఆవరణలో గురువారం నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి జీవీఎంసీ ఎన్విరాన్‌మెంటల్ సెల్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె.స్వప్న ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పర్యావరణ పరిరక్షణ మన సమష్టి బాధ్యత అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్య ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణ పుష్పాలతో స్వామికి అర్చన చేస్తున్న అర్చకుడు



జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన వైభవంగా జరిపించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పటిస్తూ 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. విశేషంగా హారతులు అందజేశారు. ఉభయదాతలకు స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

ఘనంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

నవంబర్ 25న విరాట్ హిందూ సమ్మేళన్



మాట్లాడుతున్న డి.ఎస్.వర్మ

సీతమ్మధార: హిందూ సమాజాన్ని కాపాడుకోవాలనే నినాదంతో విరాట్ హిందూ సంఘ్ ఏర్పాటు చేశామని వ్యవస్థాపక అధ్యక్షుడు డి.ఎస్.వర్మ తెలిపారు. గురుద్వారా దరి ఒక హోటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నవ నరసింహ క్షేత్రం సింహాచలం లాంటి పుణ్యప్రదేశం, దక్షిణ భారతదేశంలో లక్ష్మీదేవి, కనకమహాలక్ష్మిగా కొలువైన విశాఖ.. విభిన్న సంస్కృతులు, వివిధ రాష్ట్ర ప్రజలకు సుఖసంతోషాలు ఇచ్చే ప్రదేశమన్నారు. విశ్వనగరంలో నవంబర్ 25న విరాట్ హిందూ సంఘ్ సమ్మేళన్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. హరి కేశవులకు ఇష్టమైన కార్తీక మాసంలో ఈ వేడుకను జరుపుతున్నామన్నారు. ఈ సమ్మేళన్‌లో హనుమాన్ శోభాయాత్ర, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు కపిల్ అగర్వాల్, రాఘవేంద్ర మిశ్రా, కె.హెచ్.వి.శర్మ, దుర్గాప్రసాద్, ఫణీంద్ర పాల్గొన్నారు.

అమ్మవు నీవే.. అఖిల జగాలకు..



బాలా త్రిపుర సుందరి అవతారంలో దుర్గమ్మవారు



లలితాదేవిగా దర్శనమిస్తున్న శ్రీ లలితా త్రిపురసుందరి



మహాలక్ష్మీదేవి అలంకరణలో భూలోకమాత



ధనలక్ష్మి అలంకరణలో విజయదుర్గాదేవి

- మహాచండీగా దర్శనమిచ్చిన శ్రీ చండికాదేవి
- భక్తులను అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఎంవీపీకాలనీ: ఎంవీపీకాలనీ సెక్టార్–4లోని శ్రీ చండికాదేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం ఆలయ కమిటీ ప్రతినిధులు ఉదయం ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించగా ఆయా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. చండికాదేవి గురువారం శ్రీ మహాచండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో శ్రీసాయి కళానికేతన్ రాగిణి కూచిపూడి నాట్యమండలి బృందం సభ్యులు పలు ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ప్రదర్శించిన నాటికలు భక్తులను అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పాట్టి రమణ, కార్యదర్శి ఉమాదేవి, గౌరవ అధ్యక్షుడు ఎస్ఆర్ బోర్‌వెల్స్ పీవీ శ్రీహరిరాజు, కోశాధికారి శ్రీనివాసరావు, కమిటీ ప్రతినిధులు శిష్ట రామకృష్ణమూర్తి, రామకృష్ణ, కొండలరావు, రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించిన రాగిణి కూచిపూడి నాట్యమండలి బృందం

శ్రీసత్యసాయిలో సేవా సమితిలో..

శ్రీ సత్యసాయి సేవా సమితి విశాఖ సిటీ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని ప్రేమసదన్‌లో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీ బాలా త్రిపురసుందరి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. 108 కలశాలతో భక్తులు ప్రదర్శనగా వచ్చి విఘ్నేశ్వరపూజ, శుద్ధి పుణ్యాహవచనం, కలశ స్థాపనం, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం వేదపఠనం, అష్టోత్తర కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులతో పాటు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పలు రూపాల్లో అమ్మవారి దర్శనం..

ఏయూక్యాంపస్: శ్రీ లలితా సుందరేశ్వర పీఠంలో గురువారం అమ్మవారు లలితాదేవిగా దర్శనమిచ్చారు. ఉదయం పంచామృత అభిషేకం, సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. శ్రీ చక్రార్చన, చండీ హోమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం శ్రీ లలితాదేవి ఆవరణార్చనతో శ్రీ చక్రార్చన, శ్రీ దేవి ఖడ్గమాలతో శ్రీచక్ర ఆవరణ దేవతా పూజ నిర్వహించారు. సాయంత్రం నక్షత్ర దీపాలంకరణ సేవ, మంగళ హారతి, తీర్థ ప్రసాద వితరణ జరిపారు. పోలమాంబ ఆలయంలో అమ్మవారు సరస్వతీ దేవి అవతారంలో దర్శనమిచ్చారు. ప్రత్యేకంగా కుంకు పూజలు, చండీహోమం నిర్వహించారు. సాయంత్రం శ్రీ గాయిత్రి సంగీత కళా సమితి వారిచే భక్తి సంకీర్తన కార్యక్రమం జరిగింది. పెదవాల్తేరు వేంకటేశ్వర స్వామి ఆలయంలో దుర్గామాత గురువారం చండీదేవిగా దర్శనమిచ్చారు.

మహాలక్ష్మిగా భూలోమాత

మద్దిలపాలెం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఐదో రోజు గురువారం భూలోకమాత మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. మద్దిలపాలెం సీఎంఆర్ సెంట్రల్ సమీపంలోని ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు.



పీతలవానిపాలెంలో మండపం వద్ద దీపాలంకరణ

ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ధనలక్ష్మిగా విజయదుర్గాదేవి..

ఆరిలోవ: విజయదుర్గాదేవి ధనలక్ష్మిగా దర్శనమిచ్చారు. జీవీఎంసీ తొమ్మిదో వార్డు పరిధి విజయదుర్గాకాలనీలోని ఆలయంలో అమ్మవారిని గురువారం రూ.10, 20, 50, 100, 500 కరెన్సీ నోట్లతో అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

ఆకట్టుకున్న దీపాలంకరణ

మద్దిలపాలెం: శ్రీనివాసుడు పుష్ప శోభితుడై, దేదీప్యమానంగా దర్శనమిచ్చారు. పీతలవానిపాలెంలో శ్రీ కృష్ణా యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గ్రామ మహిళలు శుక్రవారం దీపోత్సవం నిర్వహించారు. మండపం ప్రాంగణంలో వేంకటేశ్వరస్వామి ఆకృతిని వేసి, పుష్పాలతో అలంకరించి, దీపాలను వెలిగించారు. సమీప ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి, దీపోత్సవాన్ని తిలకించారు. అనంతరం అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.

అన్నదానం నేడు..

మద్దిలపాలెం: శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురంకాలనీ ఆటోస్టాండ్ వద్ద శుక్రవారం మహా అన్నదాన కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం ప్రారంభమవుతుందని, భక్తులు హాజరై ప్రసాదం స్వీకరించాలని కోరారు.

ప్రజా భాగస్వామ్యంతోనే 'ఉక్కు' పరిరక్షణ



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణకు కార్మికులు చేస్తున్న ఉద్యమం వారి పోరాట శక్తికి నిదర్శనమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 980వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఓబీసీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణ ఉద్యమంలో ప్రజలందరినీ భాగస్వాములు చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ప్రజా భాగస్వామ్యంతోనే ఉక్కు పరిరక్షణ సాధ్యమన్నారు. ఉక్కు పరిశ్రమను కాపాడుకుంటేనే కార్మికులకు భవిష్యత్తు ఉంటుందన్నారు. కర్మాగార పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.